AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
24-9-2025 (Wednesday) MAIN EDITION

## ఐపీవోకు రీసైక్లింగ్ కంపెనీ




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** రీసైక్లింగ్ వ్యాపారంలో ఉన్న జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ కంపెనీ ఐపీవోకు వచ్చింది. దీని సబ్‌స్క్రిప్షన్ బుధవారం ప్రారంభం కాగా.. ఈనెల 26వ తేదీ వరకు కొనసాగనుంది. కంపెనీ మార్కెట్ నుంచి రూ. 1,250 కోట్లు సమీకరించనుంది. రూ. 500 కోట్ల విలువైన 2.16 కోట్ల షేర్ల జారీతో పాటు రూ.750 కోట్ల విలువైన 3.23 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనుంది. ఐపీవో ధరల శ్రేణి ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.220 నుంచి రూ.232 గా నిర్ణయించింది. లాట్ సైజు 64 షేర్లు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ కోసం గరిష్ట ప్రైస్ బాండ్ వద్ద రూ.14,848 తో దరఖాస్తు చేసుకోవాలి.

## నేడు భారత్ – బంగ్లాదేశ్ మ్యాచ్




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ 2025 ఫైనల్ రేసు ఇప్పుడు ఉత్కంఠ భరితంగా మారింది. సూపర్ 4లో టీమ్స్ మధ్య పోటీ మరింత రసవత్తరంగా మారడంతో అభిమానులు ఆసక్తిగా ఏర్పడింది. నేడు దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరుగనున్న భారత్ - బంగ్లాదేశ్ మ్యాచ్ జరుగనుంది. ఇది టీమిండియా చాలా కీలకం. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే.. టీమిండియా ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలుస్తుంది.

## బ్రెయిన్ ఈటింగ్ అమీబా కలకలం



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** కేరళలో ప్రాణాంతక బ్యాక్టీరియా సంచలనం సృష్టిస్తోంది. బ్రెయిన్ ఈటింగ్ అమీబాగా పిలవబడే ప్రైమరీ అమీబిక్ మెనింగోఎన్సెఫలైటిస్ వ్యాధి కేసుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 80 కేసులు నమోదయ్యాయి. ఇందులో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.

## భగ్గుమన్న లద్దాఖ్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో బుధవారం తీవ్ర నిరసనలు చెలరేగాయి. రాష్ట్ర హోదా కోసం లేహ్ నగరంలో పెద్ద ఎత్తున ఆందోళనకారులు రోడ్డెక్కారు. వారిని చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులతో ఘర్షణకు దిగారు. బీజేపీ కార్యాలయానికి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు.

## పరుగులు పెడుతున్న పసిడి ధర



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బంగారం ధర రోజురోజుకు రికార్డులు సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా ఆగకుండా పెరుగుతోంది. బుధవారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,15,700 కు చేరుకోగా, 22 క్యారెట్ల పది గ్రాముల ధర రూ. 1,06,060గా నమోదైంది. ఇక వెండి కిలో ధర రూ. 1,50,100 పలికింది.

## వర్గల్ సరస్వతి ఆలయంలో కవిత పూజలు



**అక్షరటుడే, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా వర్గల్‌లో గల జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం సందర్శించారు. దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కవితకు జాగృతి కార్యకర్తలు, అభిమానులు, ఆలయ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్గల్ సరస్వతి అమ్మవారి ఆలయానికి నవరాత్రి ఉత్సవాల సమయంలో రావడం తన అదృష్టమని అన్నారు. అమ్మవారి దయతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

## అక్టోబర్ 3 నుంచి రేషన్ షాపులు బంద్



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో రేషన్ డీలర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 3 నుంచి దుకాణాలు బంద్ చేయనున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్ల సాధన కోసం డీలర్లు సమ్మె బాట పట్టనున్నారు. కమీషన్ బకాయిలు విడుదల చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కొంతకాలంగా డీలర్లు కోరుతున్నారు. ఈ మేరకు ఎర్రమంజిల్ పౌరసరఫరాల భవన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సమ్మె నోటీస్ సైతం అందించారు. వచ్చే నెల 1, 2 తేదీల్లో ఉపవాస దీక్షలు చేపట్టి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## ఉద్యోగులకు సర్కారు గుడ్‌న్యూస్..!

**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ సర్కారు తీపి కబురు చెప్పడానికి సిద్ధం అవుతోంది. ఉద్యోగులకు భారీ మొత్తంలో ప్రమాద, ఆరోగ్య బీమా అందించాలని భావిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించడానికి బీమా సౌకర్యం కల్పించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా రూ.1.25 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు ప్రమాద బీమా కల్పించాలని యోచిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఈ మొత్తం వారి కుటుంబాలకు అందనుంది. ఈ మేరకు బ్యాంకులు, బీమా సంస్థలతో చర్చలు జరుపుతోంది. చర్చలు కొలిక్కి వస్తే బీమాపై ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉంది.

**గ్రూప్–1 ర్యాంకర్లకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఇది వరకు సింగిల్ బెంచ్ తీర్పును ద్విసభ్య ధర్మాసనం సస్పెండ్ చేసింది. గ్రూప్–1 ర్యాంకులను ఇటీవల కోర్టు రద్దు చేయగా.. తాజాగా దానిపై స్టే విధించింది. దీంతో ర్యాంకు సాధించిన అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తుది తీర్పునకు లోబడి నియామకాలు చేపట్టాలని ధర్మాసనం పేర్కొంది.**

**–అక్షరటుడే, హైదరాబాద్**

# గ్రూప్-1 ర్యాంకర్లకు ఊరట



- పరీక్షలపై సింగిల్ బెంచ్ తీర్పు సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసిన డివిజన్ బెంచ్
- హర్షం వ్యక్తం చేస్తున్న ర్యాంకర్లు

తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. అయితే రెండు సార్లు ప్రిలిమ్స్ పరీక్ష రద్దు అయింది. తర్వాత మూడోసారి ప్రిలిమ్స్ విజయవంతంగా పూర్తయింది. మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన టీజీపీఎస్సీ ఫలితాలను విడుదల చేసి, అభ్యర్థులను సైతం ఎంపిక చేసింది. గ్రూప్-1 ఫలితాలపై కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనం సక్రమంగా జరగలేదని వారు ఆరోపించారు. దీంతో ఏకసభ్య ధర్మాసనం దీనిపై విచారించి ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. గ్రూప్-1 ఫలితాలు, ర్యాంకులను రద్దు చేసింది. అంతేగాకుండా మళ్లీ మూల్యాంకనం చేయాలని, లేదంటే.. పరీక్ష రద్దు చేసి కొత్తగా నిర్వహించాలని ఆదేశించింది.

గ్రూప్-1 పరీక్షలపై సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్ ఎదుట సవాల్ చేసింది. గ్రూప్-1లో ర్యాంకులు సాధించిన వారు సైతం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై బుధవారం వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది. విచారణను వచ్చే నెల 15కు వాయిదా వేస్తూ తీర్పు చెప్పింది. తుది తీర్పునకు లోబడి నియామకాలు చేపట్టాలని ఆదేశించింది. దీంతో ర్యాంకు సాధించిన అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు.

### మూడో సారి..

గ్రూప్-1 నోటిఫికేషన్ 2022లో వెలువడింది. 2022 సెప్టెంబర్ 16న పరీక్ష నిర్వహించారు. అప్పుడు పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో పరీక్ష రద్దు చేశారు. మళ్లీ 2023 జూన్ 11న పరీక్ష జరగ్గా.. బయోమెట్రిక్ తీసుకోలేదని పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో పరీక్షను రద్దు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరోసారి 2024 జూన్‌లో పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫలితాలు ప్రకటించి మెయిన్స్ కోసం అభ్యర్థులను ఎంపిక చేశారు. మెయిన్స్ పరీక్షలు 2024 అక్టోబరు 21 నుంచి 27 వరకు జరిగాయి. 2025 మార్చి 10న వీటి ఫలితాలు విడుదలయ్యాయి. అయితే కొందరు అభ్యర్థులు మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఫలితాలను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తాజాగా ద్విసభ్య ధర్మాసనం ఆ తీర్పుపై స్టే విధించింది.

## జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో బుధవారం ఆయన పర్యటించారు. నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల భారీ వర్షాలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. దీంతో బుధవారం ఉదయం మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. షేక్‌పేట్ డివిజన్‌లోని ఓయూ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో జరిగిందే.. జూబ్లీహిల్స్ లోనూ జరుగుతుందన్నారు. తామే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ గెలుస్తామనే భ్రమల్లో ఉందని ఎద్దేవా చేశారు. నగరంలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు పొన్నం తెలిపారు. అయితే పార్టీ టికెట్ ఎవరికి ఇవ్వాలనేది హైకమాండ్ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఎమ్మెల్సీ మధుసూదనాచారి హెచ్చరించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని ఓ వైపు సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారన్నారు. మరోవైపు ఆయనే కోర్టులో కేసులు వేయిస్తున్నారని ఆరోపించారు. ''అన్యాయం జరిగితే భరించొచ్చు.. అవమానం జరిగితే సహించం.. మనసు గాయపడితే పర్యావసనాలు తీవ్రంగా ఉంటాయి'' అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లు 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఇది కాంగ్రెస్ పార్టీ తానంతట తాను ఇచ్చిన హామీ అని.. బీసీలు చేసిన డిమాండ్ కాదన్నారు. బీసీలకు 75 ఏళ్లుగా దేశంలో అన్యాయం జరిగిందన్నారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంటే కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని అమలు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## పాట్నాలో సీడబ్ల్యూసీ సమావేశం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం బీహార్ రాజధాని పాట్నాలో జరుగుతోంది. పాట్నాలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి సమావేశాలు ప్రారంభించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ సహా కీలక నేతలు పాల్గొన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## రష్యా విమానాలను కూల్చేయాలి: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రపంచంలోని రెండు అతిపెద్ద శక్తుల మధ్య వివాదం ముదురుతోంది. నాటో కూటమి దేశాల గగనతల సరిహద్దులను ఉల్లంఘించి రష్యా ఫైటర్ జెట్లు దూసుకురావడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే రష్యా విమానాలను కూల్చేస్తామని తెలిపారు. ఆయన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఓ విలేకరి ''అలాంటి పరిస్థితుల్లో నాటో సభ్యదేశాలు రష్యా విమానాలను కూల్చేయాలా?'' అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ 'అవును.. కూల్చేస్తాం' అని బదులిచ్చారు. ఇటీవల కాలంలో నాటో దేశాలైన పోలాండ్, ఎస్తోనియా సహా పలు నాటో సరిహద్దుల్లోకి రష్యా ఫైటర్‌జెట్లు చొరబడిన విషయం తెలిసిందే.



## ఓజీ టీంకు షాకిచ్చిన తెలంగాణ హైకోర్టు

**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన మోస్ట్ అవైటెడ్ మూవీ ఓజీ గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సమయంలో మూవీ టీంకు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. సినిమా క్రేజ్ దృష్టిలో ఉంచుకొని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు టికెట్ రేట్ల పెంపునకు అనుమతిచ్చాయి. కాగా.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆ హీరోయిన్‌పై మమత షాకింగ్ కామెంట్స్

**ఒకప్పుడు టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న మమతా మోహన్ దాస్.. ఇప్పుడు అంతగా తెలుగు తెరపై కనిపించకపోయినా, ఆమె పేరుకు మాత్రం ప్రత్యేక గుర్తింపు ఉంది. తాజాగా ఆమె పాత ఇంటర్వ్యూలో చేసిన షాకింగ్ వ్యాఖ్యలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ హీరోయిన్ నయనతారపై పరోక్ష విమర్శలు చేసినట్టు అంతా చర్చించుకుంటున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన ఓ సినిమాకు సంబంధించి మమతా మాట్లాడుతూ.. "ఆ సినిమాలో ఓ పాట కోసం నన్ను ఎంపిక చేశారు. దాదాపు నాలుగు రోజుల పాటు సాంగ్ షూట్ చేశాం. కానీ షూటింగ్ సమయంలోనే నా ఫుటేజ్ మొత్తం తొలగించబడిందని అర్థమైంది. తెరపై నేను కేవలం ఒక్క సన్నివేశంలో మాత్రమే కనిపించాను, అదీ వెనుక నుంచే.." నిమాలో హీరోయిన్‌గా నటించిన వాళ్ల వల్లే నా సాంగ్ డిలీట్ అయింది." అని చెప్పుకొచ్చారు.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**

